# "పరిత్యక్త"

రచన :
శ్రీ పోతుకూచి దత్తాత్రేయమూర్తి

సాయంసమయం. సాంధ్యసూర్యుని బంగారు కిరణాలు సముద్ర తీరానికో వింత అందాన్ని కూరుస్తున్నాయి. షికారుకొచ్చే ప్రజాసమూహం రకరకాలుగా వేరువేరు స్థలాలలో ఆసీనులవుతున్నారు. కాని ఒంటరిగా కూర్చొని అవ్యక్తాలోచనలతో తారు మారవుతున్న ముకుందరావు మాత్రం అనిర్వచనీయమైన బాధతో కంటతడి పెట్టుకుంటున్నాడు. "అభాగ్యుడా ఎన్నాళ్ళు నీవీ ఆ వేదనతో హృదయాన్ని గాయపరుచు కుంటావు. పోను పోను యీ మనోవ్యాధితో నీ శరీరారోగ్యమే పాడవుతుంది. దాంతో కొంత కాలానికి నీ ప్రాణాలకే మోసంవస్తుంది సుమా! నీ లాంటి భగ్నజీవు లీ విశాలప్రపంచంలో ఎంత మందిలేరు? వారంతా నీలాగే సౌఖ్యాల్ని కాలదన్ని మనోవ్యాధితో కృషిస్తున్నారా? పోయిన నీ సరోజని కలుసుకొని క్షమాపణ వేడుకో... వెళ్ళు .." అంటూ మనసు ప్రభోధించింది.

మరుక్షణంలో ఆ మనసే "ఆఁ ఎంత మోసం! నీ ప్రియురాలి కోసం అమాయకురాలు పార్వతి జీవితం నాశనం చేస్తావా? దుర్మార్గుడా .. తాళి కట్టేనా డెక్కడికి పోయింది నీ తెగింపు– ఆనాడే నాకీపెళ్లి వద్దని చెప్పలేకపోయావ్రా. మానసిక దౌర్బల్యంతో నిస్సారంగా తలవూపి అగ్ని సాక్షిగా పెళ్ళాడావు. ఇప్పుడు నీవెళ్ళితే పార్వతి గతేంకాను?" అంటూ మందలించింది.

"వద్దు– నీ భార్య కోసం నీ జీవిత కుసుమం నాశనంచేసుకోకు. ఇష్టంలేని భార్యతో కాపరం చేయటం నరకం కన్నా హీనమయింది. వెళ్ళిపో ... నీ సరోజ నిన్ను కాదనదు ... కాకినాడకు వెళ్ళు... రేపే బయలుదేరి వెళ్ళు. ఒకసారి నీ సరూని చూడు. చదువుకున్నావు. ఎక్కడో అక్కడ నీ సరూని నువ్వు బ్రతికించుకో గలవు... ఊఁ ... లే..." అంటూ తొందర పెడుతున్నట్లు ఎదురుగా సముద్రతరంగాలు మరింత ఎత్తుగా లేస్తున్నయ్.

అంతే! తానూ ఒక నిర్ధారణకు రావాలి మరి, లేకపోతే బలవంతంగా అంటగట్టిన యీ భార్యతో ఎప్పుడూ ఆవేదనతో ఎలా జీవించగలడు? నిన్ననే తన స్నేహితుడు సత్యమూర్తి కాలేజీలో లవ్ చేసి రిజష్టరు మేరేజీ చేసుకొని సుజాతతో నవ్వుతూ చిలకా గోరింకలలా బీచీకి షైరుకు రావటం తాను చూస్తూనేవున్నాడుగా... అన్యోన్య దాంపత్యమంటే అది– నేనూ సరోజని పెళ్ళి చేసుకున్నట్లయితే అలాగే షికారుకొచ్చే వాణ్ణిగా అనుకుంటూ ఏదో తీరని అనుభూతిని ఆస్వాదిస్తూ క్షణకాలం స్వర్గ సుఖాల్లో విహరించాడు.

"ఓరే ముకుందా... ఇక్కడ నీ భార్య జీవితం నాశనం చేస్తున్నది గాక-పెళ్ళి చేసుకొని భర్తతో అన్యోన్యంగా కాపరం చేస్తున్న సరోజ కాపరంలో చిచ్చుపెట్టటానికి తలపడుతున్నావా నీచుడా ? యీనాడు సరోజ నీ వస్తువుకాదని గుర్తించు ఆమెపరాయిదయిపోయిందనిమాత్రం మరచిపోకు" యీసారి తీవ్రంగా అంది మనసు.

యీ ఆలోచనలు మనసులోకి రావటంతోనే ముకుందరావు ఒళ్లు జలతరించింది. క్రిందటి క్షణంలో చిరునవ్వును గోచరింపజేసిన ఆ ముఖం కళావిహీనమైంది. మేఘపరంపరల అడ్డుచే చీకటివెలుగులు తారుమారవుతున్నట్లు ముకుందరావు మనసులో అవ్యక్తాలోచనలు అటూ

యిటూ చలిస్తున్నయ్. యీ స్థలంలోనే "మిమ్మల్ని నమ్మొచ్చా" అంటూ అమాయకంగా కండ్లలోకి చూసిన సరోజకు "పిచ్చిసరూ! ప్రపంచమంతా ఏకమై ఎదురు తిరిగినా నీకు అన్యాయం జరగనీయను" అంటూ యిచ్చిన తన వాగ్దానానికి ఆమె ఆనంద భాష్పాలు రాల్చింది. పాపం! తాను ధన్యురాలయినట్లు తృప్తిపడింది. తన జీవితాన్నిలా నాశనంచేసి యింత అన్యాయం చేస్తాడని ఆమె ఒకసారయినా ఊహించుకోలేక పోయింది. మధురమైన అనుభూతుల్ని ఆస్వాదిస్తూ క్షణిక సౌందర్య సుఖాని కాంసించి భ్రమించింది. తన పవిత్రప్రేమ ప్రళయంగా మారి తన్ని వెంటాడుతుందని తెలుసుకోలేకపోయింది." ముకుందరావు ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తుంటే తన విద్యార్థి దశంతా స్మృతి పథంలో మెరసింది. భోరుమని ఏడ్చాడు ముకుందరావు. సముద్ర ధ్వనితో అతని ఆత్మఘోష కలిసి పోతున్నది. తన ప్రస్తుత పరిస్థితికి క్రుంగిపోతూ ఆవేదనతో ఆరాట పడుతున్నాడు.

ఎదురుగా బొంబే మ్యూచియల్ శిఖరంపైన గడియారం ఆరు గంటల సూచించింది. ముకుందరావు నీరసించిన తన కాళ్ళను బరువుగా ఇంటి ముఖం పట్టించాడు.

* * *

ముకుందరావు యూనివర్సిటీలో యమ్. యస్. సి. చదివే రోజుల్లో తన క్లాసులోనే తనతోపాటే యమ్. యస్. సి. చదువుతుండేది సరోజ. సహజమైన ఆమె అందం తన తోటి విద్యార్థుల్ని ఉన్మత్తుల్ని చేస్తుండేది. ఒక రోజు ప్రాక్టికల్స్‌లో తెలయని విషయం ముకుందరావు నడిగింది. ముకుందరావు వాటిని గురించి సరోజకు వివరంగా బోధించాడు. అంతే! ఆ రోజు నుంచి ముకుందరావుకూ— సరోజకూ ఏవో తీరనికోరికలు, మధురస్మృతులూ ఒకరికి తెలియకుండా ఒకరిలో ఉత్పన్నమయాయి. మరొక రోజు కెమిస్ట్రీ నోట్సు అడిగింది. ఆ రోజు నుంచి ముకుందరావుకి సరోజతో కొంచెం పరిచయమేర్పడింది. అప్పటి నుండి సరోజతో చనువుగా, మాట్లాడేవాడు. ఆమె అమాయకత్వమూ ముఖారపిందం, శరీరసౌష్టం— అన్నీ తన హృదయాన్ని యిట్టే ఆకర్షించాయి.

క్రమంగా ప్రతినిత్యం సరోజ ఇంటికెళ్ళి కొద్ది సేపువుండి వచ్చేవాడు. ఆ కాసేపూ ఓ స్వర్గంలో వున్నట్లుండేది. సరోజ తల్లిదండ్రులు సంపన్న కుటుంబికులు. గౌరవమైన వారు. చాలా మర్యాదస్థులు. తననెంతో గౌరవించేవారు. ప్రతి రోజూ సరోజా తానూ కారులో షికారు కెళ్తుంటే ఇద్దరి ప్రేమాతిరాగాలు చూచి ఆనందించే వారు. కుమార్తెనెంతో గారాబంగా పెంచుకున్నారు.

ముకుందరావు మామూలుగా ఇంటి కెళ్ళే సరికి తన మేడక్రింది భాగంలో నూతన వ్యక్తులు ముగ్గురు కన్పించారు. వారికెదురుగా తన వృద్ధ తండ్రేదో మాట్లాడుతున్నాడు. ఆ వచ్చిన వ్యక్తుల్లో ఒక పెద్ద మనిషి నసుగుతూ 'అబ్బాయిగారు వీరేనాండీ'? అని ముకుందరావు తండ్రినడిగాడు. ఆయన ఔనన్నట్లు తల వూపాడు. ముకుందరావుని చూచి కొనసాగిస్తున్న తమ సంభాషణలను మాని మౌనం వహించారు.

ముకుందరావివేవీ పట్టించుకోకుండా ఎకాయెకిన మేడమీద తన గదిలోకెళ్లి డ్రస్ మార్చుకున్నాడు. తన గదిలో టేబుల్ మీద వుంచిన సరోజ ఫొటోవేపు చూచి ఆనందడోలికల్లో వూగుతున్నాడు. తియ్యని వూహాలతో మైమరచి వున్న ముకుందరావుకు తన తండ్రి ఖంగుమనే దగ్గు అంతరాయం కల్గించింది. అడుగుల చప్పుడూ కఱ్ఱపోటూ, వెంటనే మట్టెలచప్పుడూ సమీపిస్తుండటము వల్ల తన తండ్రీ, తల్లీ తన

గది వేపు రావటం పసిగట్టాడు ముకుందరావు. కాని వీరిద్దరూ ఏకకాలంలో తన గదికి విజయం చేయటం ఇదే మొదటిసారి. ముకుందరావు ఎడమ కన్ను అదిరింది. దీనివల్ల కొంత భయం- అశుభం రానున్నదని గ్రహించ గలిగాడు.

వీరి రాకను గ్రహించిన ముకుందరావు సరోజ ఫోటోను సర్దేశాడు. మెల్లెక్కుతూ 'ముకుందా' అంటూ పిలిచిన తన తండ్రి కేక వల్ల గది రీ సౌండు యిచ్చింది. 'వస్తున్నా నాన్న' అంటూ వారికెదురెళ్ళాడు ముకుందరావు. తిన్నగా రెక్కపట్టుకొని తన తండ్రిని తన గది వేపు తీసికొస్తున్న అమ్మ ముఖం ఆవేళ ఎందుకో ప్రకాశవంతంగా వికసించి వుంది. "మీరు నా గదికి మేడ ఎక్కి రాకపోతే నన్నే క్రిందకు పిలిస్తే రాలేకపోయానూ" అన్నాడు ముకుందరావు. "నీతో మాట్లాడాల్సి వస్తున్నాలేరా" మధ్య మధ్య దగ్గుతూ సమాధానమిచ్చాడు అతని తండ్రి రంగయ్య. ఔనన్నట్లు తల వూపింది తల్లి శాంతమ్మ. గదిలోకొచ్చి కూర్చున్న రంగయ్య "నాయనా ముకుందా! నీ కోసం విజయనగరం నుండి ఒకసంబంధం వచ్చింది. గౌరవకుటుంబీకులు. పిల్ల పేరు పార్వతి. స్కూలుపైనలు వరకు చదువు కుంది. నీవు ఇంట్లోలేనప్పుడు మన యింటి కొచ్చారు. నీతో చెప్పకుండానే తాంబూలాలు పుచ్చుకున్నాను. లగ్నాలు కూడా నిశ్చయించు కున్నాము." అంటూ ఖంగున దగ్గాడు. యీ మాటలు వింటున్న ముకుందునికి మతిపోయినట్లు తోచింది. పెదవులు వణికినయ్. శరీరం గగుర్పొడిచి కేశనాళికలు నిక్కపొడుచుకున్నయ్. కాంతివంతమైన ముఖ పద్మం వాడిపోయి కళావిహీనమైంది. గద్గదిక కంఠంతో "నాకీపెళ్లివద్దు-నాన్నా! ఇష్టంలేనిపెళ్లి చేసుకుని నేను నా జీవితాన్ని నాశనం చేసుకోలేను" అన్నాడు. యీ మాటలు విన్న రంగయ్య వృద్ధ కేశరిలా మండి పడ్డాడు. తన మాటకు విలువ పోతుందేమోననీ తనని మాట తప్పిన వాడని లోకం నిందిస్తుందేమోనని ఎంతో ఆవేశపడ్డాడు. రంగయ్య తానెప్పుడూ ఒక్కగా నొక్కకొడుకు తన మాట నిలా తిరస్కరించి తన ప్రతిష్టకు అవమానం తెస్తాడని ఏనాడు వూహించలేదు. వణకుతున్న చేతులతో పార్వతి ఫోటో ముకుందుడి ముందు పడేసి "అందాల బొమ్మ- యీ పిల్లకేం తక్కువరా" అన్నాడు. శాంతమ్మ కళ్ళవెంట నీళ్ళు తిరుగుతున్నాయి. ముకుందుడోసారి పార్వతి ఫోటో తన ఆర్ద్రనేత్రాలతో పరిశీలించాడు. పా-ర్వతి- బాగానే వుంది కాని- సరోజతో యిదేపాటి సరితూగుతుంది. మరుక్షణంలో సరోజకు తానిచ్చిన వాగ్దానాలు జ్ఞప్తికొచ్చి కండ్ల వెంట నీరు ధారాపాతంగా కార్చాడు. ఎదురుగా మాతా పితృలు హృదయవేదనతో ఆవేశ పడుతున్నారు. "నాయనా మీ నాన్న పరువు నిలబెట్టరా" అంటూ శాంతమ్మ ముకుందరావు వేపు చూసింది. మెత్తని మనస్తత్వం గల ముకుందుని మనసు ద్రవించింది. అతడనిర్వచనీయమైన ఆవేశంతో "స-రే-న-మ్మా" అన్నాడు. అతని మానసిక దౌర్బల్యమే అతన్ని యీ ఇష్టంలేని పెళ్లికి ఒప్పించింది. రంగయ్య శాంతమ్మలు ముకుందరావు మొహంవేపు చూచి అత్యానందంతో కొడుకుని మూర్ధాఘ్రాణం చేశారు. అంతే!- అనుకోకుండానే ఒక పీడ కలలా తనకు పార్వతికి వివాహం జరిగి పోయింది.

ముకుందరావుకు వివాహం అయిందని తెలుసుకున్న సరోజ ఎంతగానో క్రుంగిపోయుంది. తన సర్వస్వమని నమ్మి తన భవిష్యత్తును గురించి ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకుంది. తన ఆశారేఖలు యీవిధంగా సన్నగిల్లినందుకు ఎంతగానో బాధపడింది. మగ జాతిలో వుండే మాయలు మర్మాలు తను ప్రయోగాత్మకంగా కనిపెట్ట గల్గింది. సరోజ తల్లి దండ్రులు- ఓ పెద్ద ఆస్తిమంతుల కుమారుడూ, బాగా చదువుకొని పెద్ద

ఉద్యోగం చేస్తున్నవాడూ అందమైనవాడూ, రఘునాథరావుకిచ్చి తమ కుమార్తెను వివాహం చేశారు. తెలియక తాను చేసిన పొరపాటు కెంతో బాధపడింది. గడచినవి మరచిపోవటానికి ప్రయత్నించింది. కాని సరోజ హృదయంలో ఓ మూల మాత్రం ఆరని ఆవేదన ప్రజ్వరిల్లుతునే వుంది. కాని సరోజ యిప్పుడు పూర్తిగా మారి పోయింది. తనభర్తతో అన్యోన్యంగా సంసారం సాగిస్తోంది. రఘునాథరావు కాకినాడలో పెద్ద మేడలో వుంటున్నాడు. దాస దాసీజనం సరోజ నెంతో ప్రేమగా చూచుకొంటున్నారు. ఆయన రైల్వే ఇంజనీరు.

పార్వతి కాపరాని కొచ్చింది. ఫొటోలో ఆమె ముఖం అందగానేవుంది. కాని ప్రత్యక్షంగా ఆమె దొడ్డికాళ్ళ మనిషి. ముకుందరావు హృదయంలో మండుతున్న ఆవేదనకు ఇది మరీ బాధను కల్గించింది. ఆ రోజునుండి ముకుందరావు మనోవ్యాధితో కృషిస్తున్నాడు.

* * *

ఆ నాడు ఆదివారం. ముకుందరావు బెడ్డింగు సర్దుకుంటూ తియ్యని ఊహాలతో ఆత్మకు సమాధానం చెప్పుకుంటుంటే ఆలోచనలకు అవరోధంగా పార్వతి "ఎక్కడికి ప్రయాణమవుతున్నారు?" అంటూ పలకరించింది. యీప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో ముకుందరావుకు బోధపడలేదు. "ఆఁ ఏమీలేదు-ఆఫీసు పనిమీద వూరెళ్ళిరావాలి" తల ఎత్తకుండానే జవాబిచ్చాడు. "తిరిగి ఎప్పుడొస్తారు" తిన్నగా అడిగింది పార్వతి. 'చెప్పలేను.' అన్నాడు విసుగుతో. పార్వతివెళ్ళిపోయింది. ముకుందరావు ఆలోచనలు యీ సారి మరోమలుపుకు తిరిగినయ్. సరోజపై తాను పెట్టుకున్న ఆశయాలూ - ఆదర్శాలు నాశనమయి తేనో! చంచలితమైన అతని మానసిక దౌర్బల్యం పెల్లుబికి ఒక్కసారి గగుర్పొడిచింది. ఇప్పుడు తను చేస్తున్న పని ఆలోచనలతో కూడినదేనా? పార్వతి- అమాయకురాలి జీవితం భగ్నపరచి పరాయిదయి పోయిన సరోజకోసం తాను ఆరాట పడటం అందని ఫలం కోరినట్లుకాదూ!

ఏమైనాసరే యీ నరకంలో వుండలేనని దృఢ నిశ్చయంతో తీర్మానించుకున్నాడు. వెంటనే క్రిందికొచ్చి వరండాలో కూర్చున్న తల్లిదండ్రులతో, ఆఫీసుపనిమీద వెళుతున్నట్లుగా చెప్పి అమాయకంగా చూస్తున్న పార్వతి వేపోసారి చూచి "వెళ్లొస్తా పా-ర్వ-తీ-" అంటూ జవాబు కోసం ఎదురుచూడకుండానే వెళ్ళిపోయాడు. పార్వతి అతను వెళ్ళిపోతున్న దిక్కునైపే చూస్తూ నిల్చుండిపోయింది.

కాకినాడకు వెళ్ళిన ముకుందరావు సరోజ అడ్రసు ప్రకారం వెళ్ళి ఎంక్వయిరీ చేశాడు. కాని రఘునాథరావుగారి ఉద్యోగం నెల్లాళ్ళ క్రిందట నాగపూర్ కి బదిలీ అయిందనిచెప్పారు. ఆరని ఆవేదనతో అతని హృదయగోళం కాగుతోంది. కృషించిన శరీరం - మాసినగడ్డం- తైలసంస్కారంలేని జుట్టు-తన యీ అవతారం- చూచి సరోజ తన్ను గుర్తుపట్టగలదా? తను ఆమెకు చేసిన ద్రోహానికి తనను మన్నిస్తుందా! ఆమె భర్త తనను అనుమానిస్తే — అవమానం కాదూ? ... వద్దు... ఎటూ వెళ్ళొద్దు ...అనుకుంటూ యింటి ముఖం పట్టడం ఇష్టంలేక నీరసించిన తనకాళ్ళను విశాల ప్రపంచంలోకి పయనమై పోవటానికి బరువుగా ముందుకు పోనిచ్చాడు. అంతులేని అతనియాత్ర ఎక్కడికో! ఎందుకో !...

పుత్ర వియోగానికి రంగయ్య శాంతమ్మలు గుండెపగిలి మనోవ్యాధితో మరణించారు. అంత పెద్ద యింటిలో ఒంటరి జీవితాన్ని గడుపుతూ తాను పరిత్యక్త అని తెలుసుకోలేని పార్వతి మాత్రం ఇంకా తన భర్త తిరిగి వస్తాడనే ఆశతో ప్రతి నిత్యం వాకిలిగడపవద్ద అమాయకంగా ఎదురు చూస్తుండేది—

★